క్లుప్తంగా

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని గ్రామాలలో నేటినుంచి వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీటీఓ రాజశేఖరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1,2 తేదీల్లో బ్యాంకులకు సెలవులు కావడంతో 3వ తేదీ బ్యాంకుల్లో డబ్బులు డ్రా చేసి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు.

అర్చకునికి సార్వభౌమ బిరుదు

వేంపల్లె : వేంపల్లెలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్న ఇంద్రకంటి ప్రసాదుశర్మ సిద్ధాంతికి గణకానంద సార్వభౌమ బిరుదు లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఒంగోలులో తేజస్వి జ్యోతిష వాస్తు వేద పరిశోధన కేంద్రం వారు నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో భాగంగా నాకు ఈ బిరుదు ఇచ్చి సత్కరించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.

పాఠశాల సహాయకులకు పదోన్నతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్ల పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలల్లో బోధనేతర సిబ్బందికి క్రమం తప్పకుండా ప్రతి ఏడాది జేఎల్ పదోన్నతులు కల్పిస్తుండగా పాఠశాల సహాయకులకు మాత్రం 20 సంవత్సరాలుగా జేఎల్ పదోన్నతులు ఇవ్వకపోవడం సరికాదని పేర్కొన్నారు. జేఎల్ పదోన్నతులకు అడ్డుగా మారిన 223 జీవోను రద్దు చేసి పాఠశాల సహాయకులకు జేఎల్ పదోన్నతులు కల్పించి వారికి న్యాయం చేయాలని కోరారు.

మతోన్మాద శక్తులకు బీజేపీ అండ

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చుపెట్టి మతోన్మాదశక్తులను పెంచి పోషిస్తోందని ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫరూఖ్ హుసేన్ మండిపడ్డారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఆవాజ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కరించకుండా ద్రోహం చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా కట్టబెడుతూ ఆదాని, అంబానీలకు పెట్టుబడుదారులుగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడాలన్నారు. ఆవాజ్ జిల్లా నాయకులు చాన్‌బాషా, షరీఫ్, అన్వర్ బాషా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల పెంపు సరికాదు

కడప రూరల్ : ఇంటి పన్నులను 15 శాతం పెంచడాన్ని ఉపసంహరించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో ఇంపాక్ట్ ఫీజులను రద్దు చేసి ఇంటి పన్నులపై 15 శాతం పెంచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాలకు గుడిపాడు వాసి

దువ్వూరు : మండల పరిధిలోని గుడిపాడు గ్రామానికి చెందిన టి.కృష్ణమూర్తి యాదవ్ ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ చైర్మన్ కత్తి మండవ ప్రతాప్ ఆహ్వానం పంపారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఈనెల 9, 10వ తేదీల్లో 48 గంటల పాటు నిర్విరామంగా ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొననున్నట్లు కృష్ణమూర్తి యాదవ్ తెలిపారు.

ఉత్సాహంగా హాకీ టోర్నమెంట్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో మాజీ హాకీ క్రీడాకారుడు దివంగత లక్ష్మినారాయణ మెమోరియల్ హాకీ టోర్నమెంట్ ఆదివారం ఉత్సాహంగా సాగింది. ఈ టోర్నమెంట్‌ను ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టర్ ఎస్.సుభాన్‌బాషా ప్రారంభించారు. తొలుత లక్ష్మినారాయణ చిత్రపటానికి పూలమాల వేసి హాకీ క్రీడకు ఆయన చేసి సేవలను ప్రస్తుతించారు. సీనియర్ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని హాకీలో రాణించాలని సూచించారు. అనంతరం హాకీ పోటీలు నిర్వహించి విజేతలకు మెడల్స్ అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీరాములపేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పంపిణీ చేశారు. తాళ్లమాపురం గ్రామానికి చెందిన మాచిరెడ్డి శివరామిరెడ్డి తోపాటు ముగ్గురికి రూ.3.40 లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు.

పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



కమలాపురం బాలికల హైస్కూల్‌లో పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న టెన్త్ విద్యార్థులు

కమలాపురం నియోజకవర్గంలో పదవ తరగతి విద్యార్థుల వివరాలు				
మండలంపేరు	పాఠశాలల సంఖ్య	బాలురు	బాలికలు	మొత్తం
కమలాపురం	14	274	288	562
వల్లూరు	6	172	141	313
చెన్నూరు	8	179	169	348
సీకే దిన్నె	14	527	309	836
పెండ్లిమర్రి	11	205	240	445
వీఎన్‌పల్లె	6	155	113	268
మొత్తం	59	1512	1260	2772

పులివెందుల టౌన్ : మండలంలో నేటినుంచి 10 పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఎంఈఓ బండి వీరారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి 8 సెంటర్లను ఏర్పాటు చేయగా అందులో 1704 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో రెండు సెంటర్లు ఏర్పాటు చేయగా వాటికి ఎగ్జామినేషన్ ఛీఫ్‌గా ఏ సెంటర్‌కు నాగాంజనేయులు, బి సెంటర్‌కు ప్రసాద్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(అంకాలమ్మపేట), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రమణప్ప సత్రం), వివేకానంద ఉన్నత పాఠశాల(బ్రాహ్మణపల్లెరోడ్డు) నలంద ఉన్నత పాఠశాల (పార్నపల్లెరోడ్డు), వెంకటప్ప ఉన్నత పాఠశాల (బాకరాపురం), సెయింటాన్స్ హైస్కూల్ సెంటర్లు కాగా వీటికి ఎగ్జామినేషన్ ఛీఫ్‌లుగా చిట్టిబాబు, శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, రామకృష్ణ, ఏ.గంగిరెడ్డి, కమలనాథశర్మలు వ్యవహరించనున్నారు. పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపింగ్ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

లింగాలలో :

లింగాల : మండలంలోని లింగాల, కోమన్నూతల, పార్నపల్లె, వెలిదండ్ల, బో నాల, పెద్దకుడాల పాఠశాలలకు చెందిన 204 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నా రు. ఇందుకోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. పరీక్ష ఛీఫ్‌గా రవిచంద్రారెడ్డి, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా శ్రీనివాసులు వ్యవహరించనున్నారు. అదేవిధంగా పరీక్షల్లో ఎలాంటి మాస్‌కాపింగ్ జరగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి నారాయణరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల సెంటర్‌లో 120 మంది వి ద్యార్థులు, రెండవ కేంద్రంలోని రాజారెడ్డి జూనియర్ కళాశాలలో 244 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1058 మంది పరీక్షలు రాస్తున్నారు. ఇందుకు 54 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు. పట్టణంలో జేడీప్ బా య్స్, గర్ల్స్ హైస్కూల్స్, సెయింట్ థామస్, జీవన్‌జ్యోతి స్కూల్స్, చిలంకూరులోని జేడీప్ బాయ్స్ హైస్కూల్స్‌లను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారి సుబ్బరావు తెలిపారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్లో సోమవారం నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన 304 మంది విద్యార్థులు గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో పరీక్షలకు హాజరు కానున్నారని ఎంఈవో లిల్లెమ్మ తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 96 మంది, గంగాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 47 మంది, వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 51 మంది, పెద్దపుత్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన 34 మంది, వేదాస్ పాఠశాలకు చెందిన 65 మంది విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఇందులో 277 మంది విద్యార్థులు ఇంగ్లీషు మీడియంలోనూ, 27 మంది విద్యార్థులు తెలుగు మీడియంలో పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

కమలాపురంలో..

కమలాపురం : టెన్త్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. పరీక్షల ప్రారంభానికి అర గంట ముందే సెంటర్లకు చేరుకోవాలని అధికారులు విద్యార్థులకు సూచనలు జారీ చేశారు.

ఈ ఏడాది నుంచి ఆరు పేపర్లే:

ఈ ఏడాది నుంచి టెన్త్ పరీక్షలు ఆరు పేపర్లకు కుదించారు. గతంలో 7 పేపర్లు ఉండేవి. ఈ ఏడాది నుంచి ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ రెండూ కలిపి ఒకే పేపర్ చేయడంతో ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరిగే పరీక్షల్లో ఆరు పేపర్లు మాత్రమే విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 100 మార్కులు చొప్పున ఆరు పేపర్లకు 600 మార్కులు ఉంటాయి. కమలాపురం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 39 ప్రభుత్వ పాఠశాలు, 20 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 1512 మంది బాలురు, 1260 మంది బాలికలు మొత్తం 2772 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలో 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖాధికారి జాఫర్‌సాధిక్ తెలిపారు. పాయసంపల్లె, ఉరుటూరు, గంగిరెడ్డిపల్లె, వీరపునాయునిపల్లె, ఎన్.పాలగిరి, రామిరెడ్డిపల్లె, మండల కేంద్రంలోని సంగమేశ్వర పాఠశాల, ప్రగతి హైస్కూలుకు చెందిన విద్యార్థులకు సంగమేశ్వర పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బాలికలు 113, బాలురు 155 మొత్తం 268 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

కడప కల్చరల్: కడప నగరం బెల్లంమండివీధిలోని మదరస జహారాలో జమా అతె ఇస్లామి హింద్, కడపశాఖ ఆధ్వర్యంలో ఆదివారం రోజేదార్లకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీక అని.. అందరూ కలిసి మెలిసి ఉండాలన్నదే ఇందులోని పరమార్థం అన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షులు మోహిద్దీన్, నగర అధ్యక్షులు రియాజ్‌బాష, ఎంపీజే జిల్లా అధ్యక్షులు రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వేతనాలను మంజూరు చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు రెండు మాసాలు పూర్తయినా ఇంకా రాలేదని సీఆర్పీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ ఆదిమూలం శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఉద్యోగులకు పీఆర్సీని అమలు చేసి వేతనాలు పెంచిందని, తమకు మాత్రం వర్తింప చేయలేదని పేర్కొన్నారు. సమగ్రశిక్షలో కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇస్తూ మూడు జీవోలు ఇచ్చినా అమలు కాలేదన్నారు. తక్షణమే ఎంటీఎస్ ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం



ఈత మట్టలతో ఊరేగింపుగా వెళ్తున్న క్రైస్తవులు

కమలాపురం : పట్టణంలోని సీఎస్ఐ, టీసీసీ, తెలుగు మండల సభ, ఆర్‌సీఎం, మన్నా తదితర చర్చీలలో మట్టల ఆదివారంను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో ఫాస్టర్ భరత్ హెరాల్డ్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, యువతీ యువకులు, బాల బాలికలు ఖర్జూరపు, ఈత మట్టలు చేతబట్టి పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో భక్తులను ఉద్దేశించి పాస్టర్ మాట్లాడారు. పూర్వం లోక రక్షకుడు ఏసుక్రీస్తు మరణానికి ముందు చివరి పరిశుద్ధ దినాన ఓలీవ కొండ దగ్గర నున్న బేతనియ అనే గ్రామంలోకి ప్రవేశిస్తున్న ఏసుక్రీస్తును అక్కడి ప్రజలు దారి పొడవునా తమ బట్టలను పరుస్తూ కర్జూర మట్టలతో స్వాగతం పలికారని అప్పటి నుంచి ఈస్టర్‌కు ముందు వచ్చే ఆదివారంను మట్టల ఆదివారం గా క్రైస్తవులు నిర్వహించు కుంటారని భక్తులకు సందేశం అందించారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. అలాగే టీసీసీ టౌన్ చర్చ్ నందు ఫాస్టర్ రెవ.విజయశేఖర్ ఆధ్వర్యంలో టీసీసీ, సీలోహు, జెరుషలేము, టీసీసీ టౌన్ చర్చిలో ఆయా పాస్టర్ల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : ముదిరాజుల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే తాను వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక గ్రామ చావడి వద్ద ముదిరాజుల జిల్లా అధ్యక్షుడు రాము ఆధ్వర్యంలో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేకి ముదిరాజులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక పెద్దపెద్ద పట్టణాలున్నప్పటికీ ముదిరాజులు తమ ఆత్మీయ సమ్మేళనాన్ని కమలాపురంలో నిర్వహించడం, అందుకు రాష్ట్ర నాయకులు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. ముదిరాజులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. అలాగే ముదిరాజుల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ ముదిరాజులు గతంలో సముద్రంలో ముత్యాల వేట చేసేవారని, అందుకే వారికి ముదిరాజులు అనే పేరువచ్చిందన్నారు. ముదిరాజులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. ముదిరాజుల వర్గానికి చెందిన విడుదల రజనీకి మంత్రి పదవి ఇచ్చారన్నారు. ముదిరాజ్ యువసేన ఫౌండర్ గూడూరు నాని మాట్లాడుతూ తాము చేపట్టిన సర్వే ప్రకారం రాష్ట్రంలో 7 లక్షల ముదిరాజ్ కుటుంబాలున్నాయన్నారు. ముదిరాజులను మొదటగా గుర్తించినది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే నన్నారు. ఈ ప్రభుత్వం ముదిరాజుల కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. 2009లో మహానేత వైఎస్సార్ ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మార్చారని, అయితే ఆయన మరణానంతరం కొందరు దీనిపై కోర్టుకు వెళ్లారన్నారు. ప్రస్తుతం ఆ కేసు సుప్రీం కోర్టులో ఉందని, ప్రభుత్వం ఇష్టమైతే ముదిరాజులను బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మార్చుకోవచ్చని, అయితే సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేయాలని తెలిపిందన్నారు. ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ముదిరాజుల మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నగరంలో శాకాహార శాంతి ర్యాలీ



శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

కడప కల్చరల్ : స్థానిక పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం వద్దగల పిరమిడ్ ధ్యాన కేంద్రం నుంచి విశ్వాత్మ పిరమిడ్ యోగా అండ్ మెడిటేషన్ రీసెర్చి సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ధ్యానులు శాకాహార ర్యాలీ నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు జీవీ శేషారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ర్యాలీ 11 గంటల వరకు కొనసాగింది. కో ఆపరేటివ్ కాలనీ, రాజారెడ్డివీధి తదితర వీధుల్లో ధ్యానులు శాకాహారమే అమృతాహారం అంటూ నినాదాలు చేస్తూ సాగారు. శాకాహారం అవసరాన్ని వివరిస్తూ అహింసో పరమధర్మః అన్న మాట ప్రకారం ప్రతి ప్రాణిలో దేవుడు ఉన్నాడంటూ నినాదాలు చేస్తూ సాగారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్లు జి.రామసుబ్బారెడ్డి, ఎంసీ ఓబయ్య, పి.రమణ, సంజీవి, మురళి, జి.శ్యామల, సరోజ, ప్రసాద్, శర్వాణి, ప్రభాకర్, వెంకట సుబ్బయ్య, బాల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మణిశయనకు ఉగాది మహానంది పురస్కారం

ప్రొద్దుటూరు : స్థానిక స్నేహశ్రీ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు దేవరశెట్టి మణిశయనకు ఉగాది పురస్కారాన్ని అందించారు. ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం విజయవాడలోని మాచినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏఎస్ఎస్ టీవీ ఆధ్వర్యంలో ఉగాది మహానంది పురస్కారాన్ని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేతుల మీదుగా మణిశయన అందుకున్నారు. మణిశయన గతంలో రోటరీ ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్‌గా, ఆర్య వైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలుగా రాష్ట్ర ఆర్య వైశ్య మహిళా విభాగం అడిషనల్ జనరల్ సెక్రటరీగా, అగస్త్యేశ్వరస్వామి ఆలయ కమిటీ దర్మకర్తగా, ప్రస్తుతం శివోహం కమిటీ వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు.

తాటి ముంజులు వచ్చేశాయ్..



మార్కెట్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న తాటి ముంజులు

పులివెందుల రూరల్ : వేసవి సీజన్ ప్రారంభం కావడంతో తాటి ముంజులు కూడా మార్కెట్లోకి వచ్చేశాయి. ప్రస్తుతం వీటి ధర డజను వంద రూపాయలతో విక్రయిస్తున్నారు. వేసవిలో తాటి ముంజులు ఆరోగ్య ప్రధాయినిగా ప్రజలు భావిస్తారు. వీటిలో శరీరంలో ఉష్ణం తగ్గించే పోషక విలువలు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇవి ఎక్కువగా వాగులు, వకలు, నదీతీర ప్రాంతాలలో కనిపిస్తాయి. తాటి ముంజులతో పాటు చెట్లు కూడా ఎంతో ఉపయోగ పడతాయి. ఒకప్పుడు గృహనిర్మాణాలలో వీటిని దంతెలుగా ఉపయోగించేవారు. సుమారు వందేళ్ల పాటు ఈదంతెలు ఉంటాయి. ఇకపోతే పూరిగుడిసెలకు కూడా తాటాకులను ఉపయోగిస్తారు. మానవాలికి ఎంతో ఉపయోగ పడే తాటి చెట్లను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది.

హంసవాహనంపై ఆదిచెన్నకేశవస్వామి



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధి చెన్నంపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదిచెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన ఆదివారం స్వామి వారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాయ పూజలు నిర్వహించారు.

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రొద్దుటూరు : ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం కల్లూరు పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లు తమ యూనియన్‌లో చేరిన సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, క్యాజువల్ లీవులు, మెటర్నటీ లీవులు లేకుండా 365 రోజులు ఆశా వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కార్మికులకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, నాయకులు సుధాకర్, హరి, యేసోబ్, లక్ష్మీనారాయణ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



వీరపునాయునిపల్లెలో అమ్మవారికి బోనాలు తీసుకెలుతున్న మహిళలు



ఎర్రగుంట్లలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న దృశ్యం

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చివెల్లి గ్రామ సమీపంలో ఉన్న గంగమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు తీర్చేందుకు కడప, అనంతపురం, కర్నూల్ తదతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి జంతు బలులు ఇచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ అర్చకులు కూడా భక్తులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో ఆదివారం నడివీధి గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. జాతరలో శనివారం రాత్రి దేవర పెద్దలను ఆహ్వానించే కార్యక్రమంతో గంగమ్మ జాతర ప్రారంభమైంది. గంగమ్మ, నల్లనమ్మ, అంకాలమ్మ, బోగాదమ్మ తల్లులకు గ్రామంలోని మహిళలు కుటుంబ సభ్యులు, బంధువులతో కలసి బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసి చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, పౌరసరఫరాల డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ రాఘవ యాదవ్‌లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలో వెలసిన ఏరువాక గంగమ్మతల్లికి గ్రామ ప్రజలు ఆదివారం బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డిలు విందులకు హాజరయ్యారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని పెండ్లిమర్రి, వెల్లటూరు, శవాస్కన్‌పల్లె, చెర్లోపల్లె, కొత్తపల్లె, యాదవాపురం, చింతవాండ్లపల్లె తదితర గ్రామాలల్లో ప్రజలు ముద్దల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గ్రామదేవతలు గంగమ్మ, అంకాలమ్మలకు భక్తులు పూజలు చేసి ఇళ్లల్లో చల్లముద్దలు ఏర్పాటు చేసుకుని విందు భోజనాలు అరగించి బంధుమిత్రులతో సంతోషంగా గడుపుకున్నారు. శ్రీనివాసపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మునెయ్య, శ్రీనువాసులురెడ్డి, మల్లారెడ్డి ఏర్పాటు చేసిన విందుకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకెదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు హాజరయ్యారు.

మైలవరంలో..

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో పెద్దమ్మతల్లి దేవరను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.